# సింగిల్ పేజి కథలు

## కొత్త స్వామీజీ

"అమ్మా... స్కూలుకి టైమవుతోంది తొందరగా టిఫిన్ తయారుచేయవే" నాలుగో తరగతి చదువుతున్న అప్పూ అమ్మను తొందర పెడుతున్నాడు.

"ఆ.. చేస్తా.. చేస్తా ఎందుకు తయారుచేయనూ. మీ అయ్య సంపాదించిన సంపాదనంతా ఎలా ఖర్చవుతుంది మరి?" విసుక్కుంది.

"అమ్మా! ఇవాళ టిఫిన్ ఏం చేస్తున్నావ్?" ఐదేళ్ల గారాలు అడిగింది.

"ఉప్మా.." పళ్లు బిగపట్టి గట్టిగా అరిచింది సరోజ.

"ఉప్మా వద్దు. ఇడ్లీ చేయ్"

"ఇడ్లీ వద్దు. ఉప్మా కావాలి"

"కాదు...ఇడ్లీ"

"కాదు...ఉప్మా"

అప్పూ, గారాలు ఇద్దరూ కొట్టుకుంటున్నారు. అసలే విసుక్కుంటున్న సరోజ వీళ్ల కొట్లాటకు మరింత చిరాకు తెచ్చుకుంది.

"ఆపండిరా మీ గోల" వంటగది నుంచి పరిగెత్తుకొచ్చి గట్టిగా అరిచింది. పిల్లలు ఠక్కున నోరు మూసుకున్నారు.

"ఇడ్లీ లేదు ఉప్మా లేదు. మీ నాన్న కొంప వదిలి ఎక్కడ తగలడ్డారో తెలియక నేను తిప్పలు పడుతుంటే మధ్యలో మీ అల్లరేంటి?" కసురుకుంది.

"అమ్మాయీ! సరోజా" అని గుమ్మంలోంచి ఎవరో పిలవగానే సడన్‌గా అటు చూసింది.

"వచ్చాడటే మీ ఆయన?" లోపలకు వస్తూ అడిగింది శారద.

"ఇంకా రాలేదు పిన్నీ. ఇవ్వాల్టికి నాలుగు రోజులు ఇల్లు విడిచి పెట్టి ఎక్కడికెళ్లారో ఏమైపోయారో ఏమీ పాలుపోవడం లేదు" కళ్లలో నీళ్లు పెట్టుకుంది.

"పీడికి ఇదేం పోయే కాలమే.. నువ్వు దిగులు పడమాక. ఊళ్లోకి ఒక స్వాముల వారు వచ్చారు. ఆయన జరిగిన విషయాలూ, జరుగుతున్న విషయాలూ, జరగబోయే విషయాలు కూడా చెప్తున్నారు. మనం వెళ్లి మన చేయి చూపిస్తే చాలు అన్నీ ఇట్టే చెప్పేస్తున్నారు. ఊరి జనం ఆయన దగ్గరకు వెళ్లి పూజలు చేయటం, కానుకలివ్వటం.. ఒకటేమిటి ఆయన్ని దైవ సమానంగా కొలుస్తున్నారు"

"అంత గొప్ప స్వాములవారా! మరీ విషయం ఇప్పటిదాకా నాకు తెలియలేదేమిటి?" ఆశ్చర్యపోయింది సరోజ.

"నువ్వు మీ ఆయన పోయాడన్న బాధలోనే ఉన్నావు గానీ బయటికొచ్చి ఒక్కసారైనా లోకాన్ని చూశావా?"

"అయితే మనం ఇప్పుడే వెళ్లి స్వాముల వారిని కలుద్దాం పిన్నీ"

"అలాగే కలుద్దాంలే గానీ ఇంట్లో పంచదార నిండుకుంది. ఉంటే ఓ కప్పు పంచదార బదులివ్వమ్మా"

'అదన్న మాట అసలు సంగతి' మనసులో అనుకుంది.

"ఓ...దానికేం భాగ్యం పిన్నీ. ఇప్పుడే ఇస్తానండి" అని వంటగదిలోకెళ్లింది సరోజ.

* * *

ప్రత్యేకంగా తనకు కేటాయించిన గదిలో దేవుని విగ్రహం ముందు కూర్చుని ఏవో మంత్రాలు చదువుతూ పూజ చేస్తున్నారు స్వాముల వారు.

ఒక యువకుడు పూజ గదిలోకి వచ్చాడు.

"నమస్కారం స్వామీజీ" రెండు చేతులు జోడించి నమస్కరించాడు. మంత్రోచ్ఛారణ ఆపి అతని వైపు చూశాడు స్వామీజీ.

"స్వామీ నాదో సమస్య"

"అపరా బుడతా...నీ సమస్య నాకు తెలుసురా"

"అదెలా స్వామీ.. కనీసం నా చెయ్యి కూడా చూడకుండానే.." ఆశ్చర్యంగా అడిగాడతను.

"ఎదురు ప్రశ్నలు వేయకురా. ఈ స్వాముల వారికి భూత భవిష్యత్ వర్తమానాలు చెప్పటానికి చెయ్యే చూడక్కరలేదురా. ముఖము చూసిననూ చాలు. నువ్వొక అమ్మాయిని ప్రేమిస్తున్నావు. కానీ ఆ అమ్మాయి మాత్రం నీ వంకైనా చూడటం లేదు. ఆ పిల్ల నీ వశం కావాలి. అంతేగా? సరే. నీ సమస్యకు పరిష్కారం చెబుతా విను" అంటూ కుంకుమ రాశిలోంచి ఒక తాయెత్తు తీశాడు.

"దీని పేరు దశదిన ముక్తి తాయెత్తు. దీనిని నీ ప్రేయసి చేతికి కట్టగలిగితే పది రోజుల తర్వాత ఆమె నీ వశమవుతుంది. దీని ఖరీదు రెండు వందలు. లక్ష్మిని నాకు ఇచ్చి తాయెత్తును నువ్వు తీసుకెళ్లొచ్చు."

"లక్ష్మి నా ప్రేయసి. మీకెలా ఇవ్వమంటారు స్వామీ" ఆందోళనగా అడిగాడు.

"మూర్ఖుడా! నేనడిగింది డబ్బు నీ ప్రేయసిని కాదు. లక్ష్మి అనగా మా దైవభాషలో డబ్బు అని అర్థం. ఇది కూడా తెలియకపోతే నీ బ్రతుకు వ్యర్థం."

"తప్పయింది స్వామీ. నన్ను శపించకండి" అంటూ జేబులోంచి రెండు వందలు తీసిచ్చి, తాయెత్తు పట్టుకెళ్లాడా యువకుడు.అతను వెళ్లగానే లోపలకు సరోజ వచ్చింది. వచ్చీ రాగానే "స్వామీ" అంటూ ఏడ్వసాగింది.

"ఇక్కడ ఆడదాని ఏడుపు కూడదు. అది ఈ ఊరికే అరిష్టం." గర్జించాడు స్వామి.

ఠక్కున ఏడుపు ఆపింది సరోజ.

"స్వామీ.. మా ఆయన..." ఆవిడ మాటలు పూర్తికాకుండానే మధ్యలోనే అడ్డుకున్నాడు స్వామి.

"ఇల్లు విడిచి వెళ్లాడు. ఎక్కడికి వెళ్లాడో తెలియదు. ఎప్పుడు వస్తాడో తెలియదు. అదేగా నీ సమస్య?"

"అవును స్వామీ ఎంత బాగా చెప్పారు"

"కైలాసగిరి మీద శివుని పాదాల కింద వేయి సంవత్సరాలు శిష్యరికం చేసినవాడను. ఆమాత్రం జాతకం చెప్పలేకపోతే నా సుదీర్ఘ శిష్యరికానికి అర్థం ఉండదు. నీ సమస్యకు పరిష్కారం కావాలంటే ముడుపులు ముట్టచెప్పాలే బాలా"

"ముడుపులా...నా వల్ల కాదు స్వామీ"

"ముడుపు లేనిదే ముక్తే లేదు" తేల్చి చెప్పాడు స్వామి.

'శారద పిన్నిని సాయమడిగితే పోలా.. మళ్లీ మా ఆయన రాగానే ఆవిడ బాకీ తీర్చేయొచ్చు' అనుకుందిమనసులో.

"నీ ఆలోచన సరియైనదేనే బాలా. మీ ఆయన తిరిగిరాగానే ఆవిడ బాకీ తీర్చేయొచ్చు"

అతని దివ్యజ్ఞానానికి అదిరిపడింది సరోజ.

"నా గదిలోకి వచ్చిన వారి ఆలోచనలు కూడా నేను తెలుసుకోగలను. నువ్వు మీ శారద పిన్ని వద్ద అప్పు చేసి సాయం సమయాన వేయి రూపాయలు తీసుకురా. మీ ఆయన మీద ఒక గ్రహం ప్రభావం చూపుతోంది. మూడు దినముల తర్వాత గృహమును చేరతాడు. ఇక నువ్వు వెళ్లొచ్చు"

ఆనందంగా వెనుదిరిగింది.

* * *

స్వాముల వారు చెప్పినట్లే మూడు రోజుల తర్వాత ఇంటికి వచ్చాడు సంజ భర్త శ్రీనివాసరావు. బ్యాగు నిండా డబ్బులు కూడా తీసుకొచ్చాడు.

"ఇంత డబ్బెక్కడిదండి?" ఆశ్చర్యంగా అడిగింది సరోజ.

"పిచ్చి మొహమా నువ్వు నన్ను గుర్తుపట్టలేకపోయావు. ఊళ్లో స్వామీజీ అవతారం ఎత్తింది నేనే" స్వామీజీ అంత ఖచ్చితంగా జాతకాలు ఎలా చెప్పగలిగాడో సరోజకు ఇప్పుడర్థమైంది.

**-ఎ.కొండలు (అడ్డూరు)**

***

## పోయిరా మాతల్లి.. పోయి రావమ్మా

తొమ్మిది గంటలయిపోయింది. గంట ముందు బయలుదేరితే కానీ రెండు బస్సులు మారి టైముకి ఆఫీసుకి చేరుకోలేడు రమేష్. కొందరిలా ఎప్పుడెళితే ఏంలే మన జీతం మనకి నెలయ్యేటప్పటికి ఠంచనుగా వస్తుందిలే అనుకొనే రకం కాదు. పై సంపాదనకాశపడే రకమూ కాదు. పదో గంటయ్యేటప్పటికి సీటులో ఉండాలి, తన పని తాను సిన్సియర్‌గా చెయ్యాలి అనే తత్వం రమేష్‌ది. అందుకే ఆ హడావిడి. భార్య అందించిన భోజనం కేరియర్ పట్టుకుని మెట్లు దిగబోతుంటే-

"ఏమండీ" అని గోముగా పిలిచింది భార్య శ్యామల.

ఏమిటీ అన్నట్టు చూశాడు రమేష్.

"ఈ రోజు మీ ఎరియర్స్ వస్తాయన్నారు కదా" నానుస్తున్నది శ్యామల.

"చెప్పు శ్యామలా నాకవతల బస్సు తప్పిపోతుంది"